ప్రజాశక్తి
సోమవారం 11 మార్చి 2024





పొత్తుల సెగ

- జనసేనకు యలమంచిలి కేటాయించారన్న వార్తతో టిడిపి శ్రేణుల ఆగ్రహం
- సమావేశంలో కుర్చీలు విసురుకున్న వైనం
- పెందుర్తిపై తేల్చుకోలేక సతమతం
- వేచిచూస్తున్న బండారు



కుర్చీలు విసురుతున్న టిడిపి యలమంచిలి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని అనకాపల్లి టిక్కెట్ జనసేనకు కేటాయించడంతో టిడిపిలో చెలరేగిన అసంతృప్తి మంటలు యలమంచిలికి విస్తరించాయి. అభ్యర్థుల పేర్లు బయటకు వచ్చినచోట ఈ సెగ క్రమంగా గ్రామగ్రామానికీ అంటుకుంటోంది. టిడిపికి బలమైన నియోజకవర్గాలను జనసేనకు కేటాయించడంపై టిడిపి కార్యకర్తలు తట్టుకోలేకపోతున్నారు. సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకొని పనిచేసిన నాయకులను పక్కనబెట్టి.. బలంలేని జనసేనకు టిక్కెట్ కేటాయించడంపై టిడిపి కార్యకర్తలు రోడ్డెక్కుతున్నారు. పొత్తులో అనకాపల్లి టిక్కెట్ జనసేనకు కేటాయించడంతో కొద్ది రోజులు నిరసన తెలిపారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు టిక్కెట్ వస్తుందని ఆశపడ్డ కార్యకర్తలు జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణను ప్రకటించాక మనస్తాపం చెందారు. స్వతంత్ర అభ్యర్థిగా పీలాను బరిలో పెట్టి గెలిపిస్తామని ప్రకటించారు. కార్యకర్తలు మనోభావాలను గౌరవించి త్వరలో నిర్ణయం తీసుకుంటానన్న పీలా చివరకు చతికిలపడ్డారు. తనకిష్టంలేకపోయినా బంధుత్వరీత్యా కొణతాల అభ్యర్థిత్వాన్ని బలపర్చాల్సి వచ్చింది. బలమున్నా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయడానికి ఆయన ధైర్యం చేయలేకపోయారు.

ఇలా అనకాపల్లిలో ఇంకా అసంతృప్తి సెగ గూడుకట్టుకుని వుండగానే మరో పిడుగులాంటి వార్త యలమంచిలి నియోజకవర్గంలో వ్యాపించింది. దీంతో ఆ నియోజకవర్గ కార్యకర్తలు భగ్గుమనిలేచారు. పొత్తులో యలమంచిలి టిక్కెట్ జనసేనకు కేటాయిస్తున్న విషయం ఆ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావుకు, సీనియర్ నాయకులు పప్పల చలపతిరావుకు చంద్రబాబు ఫోన్‌చేసి చెప్పిన విషయం దావానంలో వ్యాపించడంతో టిడిపి కార్యకర్తలు రగిలిపోయారు. శనివారం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో కుర్చీలు విసిరిపారేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావును గెలిపించుకోవాలన్న పట్టుదలతో కార్యకర్తలున్నారు. నాగేశ్వరరావుకు టిక్కెట్ ఇస్తున్నట్లు పార్టీ అధినేత చంద్రబాబు గతంలో చెప్పడంతో ఈ ఐదేళ్ల పాటు ప్రగడ చురుగ్గా పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీ బలానికి తోడు సానుభూతి కూడా ప్రగడపై వుంది. దీంతో ఆయన గెలుస్తారన్న ధీమా నాయకులు, కార్యకర్తల్లో వుంది. టిడిపి, జనసేన, బిజెపి పొత్తుతో నియోజకవర్గాల కేటాయింపు వ్యవహారం టిడిపి అధినేత చంద్రబాబు చేతిలో నుంచి చేజారినట్లయింది. పట్టుబట్టలేక ఒక్కో నియోజకవర్గాన్ని వదిలేసుకుంటున్నారు. టిడిపికి సానుకూలంగా వున్న యలమంచిలిని వదులుకొని జనసేనకు కేటాయించడం ఎంతవరకు న్యాయమని ఆ పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే టిడిపికి యలమంచిలి టిక్కెట్ ఇవ్వాలని సమన్వయ కమిటీ సమావేశంలో తీర్మానించారు. అయితే, కొద్ది రోజుల్లో జనసేన అభ్యర్థిగా సుందరపు విజయకుమార్‌ను ప్రకటించే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఆ తరువాత టిడిపి కార్యకర్తల్లో ఏ స్థాయిలో నిరసన వుంటుందో వేచిచూడాల్సి ఉంది.

పెందుర్తిలో ఇలా..

టిడిపి సీనియర్ నాయకులు బండారు సత్యనారాయణమూర్తిని కాదని పెందుర్తిని జనసేనకు కేటాయించే విషయమై చంద్రబాబు తేల్చుకోలేక పోతున్నారు. పెందుర్తిని వదులుకొని వేరొకచోట పోటీకి జనసేన సిద్ధపడితే మాడుగుల ఇవ్వడానికి చంద్రబాబు సుముఖంగా వున్నట్లు తెలిసింది. పట్టుబట్టి జనసేన అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబుకు పెందుర్తి టిక్కెట్ సాధించుకుంటే అనకాపల్లి, యలమంచిలిని వదులుకున్నట్లు ఈ నియోజకవర్గంలో బండారు అనుచరులు అంత సులభంగా అంగీకరించే పరిస్థితిలేదు.



నినాదాలు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

జిఒ 3కి చట్టబద్ధత కల్పించేందుకు ఆర్డినెన్స్ తేవాలి

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నంనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిఒ 3కి చట్టబద్ధత కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కిముడు చిన్నంనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం, మరికొన్ని సంఘాలు కలిపి ఇచ్చిన మన్యం బంద్‌కు మద్దతుగా ఎల్‌ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలను గిరిజనులకు ఇవ్వాలన్నారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. జిఒ నెంబరు 3 రిజర్వేషన్ చట్టబద్ధత కోసం టిఎసి ఆమోదించిన నూతన రెగ్యులేషన్ ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ మాతృభాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలన్నారు. ఎపి ప్రభుత్వ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఆదివాసీ వాల్మీకి, కొండదొర తెగలను పునరుద్ధరణ చేయాలన్నారు. నాన్ షెడ్యూల్డ్ ప్రాంతంలోని 1500 ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉల్లి బొంజి బాబు, కార్యదర్శి జి.వెంకట రమణమూర్తి, అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రూడా సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పొత్తుతో వైసిపికి వణుకు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి, బిజెపి, జనసేన పొత్తుతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెన్నులో వణుకు మొదలైందని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, ఈ నేపథ్యంలో ఈ రాజకీయ పొత్తుకు ఆవశ్యకత ఉందని అన్నారు. విశాఖలో కార్పొరేషన్ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేశారని విమర్శించారు. 31వ వార్డులో టిడిపి కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ మరణంతో జరిగిన ఉప ఎన్నిక సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బిపిన్ కుమార్ జైన్‌ను రాత్రికి రాత్రి వైసిపి అభ్యర్థిగా మార్చేశారని విమర్శించారు. తిరుపతిలో ఓటర్ల జాబితాలో కూడా అవకతవకలు జరిపారని, ఒక ఐఎఎస్ అధికారి సస్పెండ్ అయ్యారని విమర్శించారు. శాసనమండలి ఎన్నికల్లో కూడా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. మంత్రి అంబటి రాంబాబు పొత్తు అనైతికం అంటున్నారని, ఆయన దృష్టి ప్రజలపై ఉంటే బాగుంటుందని అన్నారు. పోలవరంపై దృష్టి పెట్టి ఉంటే ఉత్తరాంధ్రకు సుజల స్రవంతి ద్వారా నీళ్లు అందేవన్నారు.

ఉపకారవేతనాలతో విద్యార్థులకు చేయూత




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమెరికన్ తెలుగు ప్రొగ్రసివ్ అసోసియేషన్ (ఆప్తా) అధ్వర్యంలో విశాఖపట్నంలోని ఆళ్వారుదాసు విద్యాసంస్థ ఐఎఎం కళాశాల వేదికగా అమెరికన్ స్టూడెంట్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం - 2024 ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్కాలర్‌షిప్పులు విద్యార్థుల బాధ్యతను మరింత పెంచుతాయని, వీటి ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆప్తా సభ్యుడు శ్రీధర్ ఆకుల మాట్లాడుతూ 2008లో పది మంది సభ్యులతో ఏర్పడిన ఆప్తా నేడు పది వేల మంది సభ్యులను కలిగి 35 విభాగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. 36 మంది విద్యార్థులకు 46 లక్షల స్కాలర్‌షిప్స్‌తో ప్రారంభమైన ఈ ప్రోగ్రాం నేడు 1280 మందికి రెండు కోట్ల రూపాయలు అందించే స్థాయికి ఎదిగిందని తెలిపారు. ఉపకారవేతనాలను ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుండి ఎంపికచేసిన వారికి అందిస్తున్నామన్నారు. ఆదివారం 54 మంది విద్యార్థులకు 12 లక్షల రూపాయలు చెల్లించినట్టు తెలిపారు. వీటికి శ్రీరామ సుంకర ఆర్థిక సహాయం అందించారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కూచిపూడి కళాక్షేత్రం కళాకారిణి మంజూష ఇరువు చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ప్రముఖులైన కుందూరి అరుణ్, బాబీ రమేష్, ప్రొఫెసర్ కృష్ణమోహన్, బ్రహ్మంనాయుడు, అప్పికొండ కాత్యాయని, ఛాయాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యాన ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం బీచ్ రోడ్‌లో వాక్ థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల, కన్సల్టెంట్ ఆప్తాల్మజిస్ట్ డాక్టర్ దివ్య దంగేటి మాట్లాడుతూ కొన్ని రకాల వ్యాధులకు దీర్ఘకాలం పాటు స్టెరాయిడ్స్ వాడకం వల్ల కంటి లోపల ఒత్తిడి పెరిగి, దృష్టి లోపంనకు దారి తీస్తుందన్నారు. 2040 నాటికి గ్లాకోమా వ్యాధితో బాధపడేవారి సంఖ్య 76 మిలియన్ల నుండి 111.8 మిలియన్లకు పెరగవచ్చునని అంచనా అన్నారు. ఈ ఏడాది వారోత్సవాలు 'స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా' అనే అంశంపై చేపడుతున్నట్టు తెలిపారు. తమ నేత్ర వైద్యశాల వారు నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం 4062 మంది పిల్లలలో 2.2 శాతం మంది స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా కలిగి ఉన్నట్లు, అలాంటి వారిలో 30 శాతం మంది అంధత్వంతో తమ దగ్గరకు వస్తున్నట్లు గుర్తించామన్నారు.

జనసేనలో యువత చేరిక



కొణతాల సమక్షంలో జనసేనలో చేరిన యువకులు

ప్రజాశక్తి-. అనకాపల్లి : జనసేన పార్టీలో పెద్ద ఎత్తున యువకులు చేరారు. ఆదివారం స్థానిక టీచర్స్ కాలనీలోని కొణతాల క్యాంపు కార్యాలయానికి విచ్చేసి మాజీ మంత్రి జనసేన,తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ సమక్షంలో జోగారావుపేట కొప్పాక. కుంచంగి, వెదురుపర్తి గ్రామాల నుండి సుమారు 100 మంది యువకులు జనసేనలో చేరారు. జనసేన కండువాలు కప్పుకున్నారు. పార్టీ విజయానికి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కొణతాల గెలుపుకు సంపూర్ణ సహకారం అందజేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో పల్లేల నాగేశ్వరరావు, జానకిరామ్, కర్రి ప్రకాష్, ఉగ్గిన రామ్ తదితరులున్నారు.

ఘనంగా కెఎన్‌వి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సోదర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కెఎన్‌వి సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, పట్టణంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సత్యనారాయణ తన వంతు ఎంతగానో కృషి చేశారన్నారు. అనకాపల్లిలో రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం, లక్ష్మీనారాయణ నగర్ లో ఉన్న ఉడా స్కేటింగ్ రింగ్ ఏర్పాటు, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలు నిర్వహణ చేయడంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు.

కార్యక్రమంలో సోదర సంక్షేమ సమితి వ్యవస్థాపకులు కొణతాల పూర్ణచంద్రరావు, సంస్థ అధ్యక్షులు జగన్మోహన్ రావు, కార్యదర్శి సీతారాం బాబ్జి, కోశాధికారి చంద్రశేఖర్, కేంద్రీయ విద్యాలయాల విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు రాపేటి నారాయణరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కేఎం నాయుడు, పూర్వపు విద్యాశాఖ అధికారి కె.వి గౌరీపతి, జాతీయ పవర్ లిఫ్టర్ కొణతాల అప్పలనాయుడు తదితరులు సత్యనారాయణను సత్కరించారు.

కొణతాలను మర్యాదపూర్వకంగా కలిసిన అనిత

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ మంత్రి, అనకాపల్లి టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను ఆదివారం పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక టీచర్స్ కాలనీ జనసేన పార్టీ కార్యాలయంలో కలిసిన వీరు ఇరువురు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు.

పైలా ఆర్థిక వితరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా గరిడి, పాలకొలుపు, అచ్చిపూత ఘనంగా నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గ టిడిపి నేత పైలా ప్రసాదరావు పాల్గొని రూ.పదివేలు సాయం అందించారు. టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రాళ్లపల్లి దేవుడి బాబు, ఎంపిటిసి కసిరెడ్డి దేవుడు బాబు. రాళ్లపల్లి శ్రీరామమూర్తి, తంగేటి శ్రీను, కడుపుట్ల గంగరాజు, గొర్లె శంకరరావు, డంక రాము, బండారు నరసింహనాయుడు. ఏ కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కనాయుడు పాల్గొన్నారు.

మహిళల హక్కుల సాధనకు ఐక్య ఉద్యమం



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా మహిళా దినోత్సవం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ,ఐద్వా, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సుబ్బారావమ్మ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా నినదించి పోరాడారని, పురుషులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, ఓటు హక్కు కావాలని, ఆస్తి హక్కు ఇవ్వాలని, మహిళలపై హింస అరికట్టాలని అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. పురుషులతో సమానంగా రక్షణరంగంతోపాటు అన్నింటా మహిళలు ముందుకు దూసుకెళుతున్నా, నేటికీ మహిళలపై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో లైంగిక దాడులు, గృహహింస కొనసాగడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే శాంతి, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం, యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు లయన్స్ క్లబ్ కృషి

ప్రజాశక్తి -అనకాపల్లి : మహిళల్లో సాధికారత, స్వయం సమృద్ధి, జీవనోపాధి కల్పనకు లయన్స్ క్లబ్, స్పందన చేయూత ఫౌండేషన్లు చేస్తున్న సేవలు అభినందనీయమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు అన్నారు. ఆదివారం 82వ వార్డు గాంధీనగరం లయన్స్ క్లబ్ హాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత సదస్సులో మాట్లాడారు. కష్టకాలంలో ఉన్న ప్రజలకు, పేదలకు, రోగులకు, మహిళలకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు శ్లాఘనీయమన్నారు. రెండవ బ్యాచ్ కుట్టు క్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. లయన్స్ క్లబ్ అనకాపల్లి శాఖ అధ్యక్షులు వెంకటరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైసిపి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు లయన్స్ పూర్వ గవర్నర్ వివిఎస్ నూకరాజు, స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఈపూరు బుచ్చిరాజు, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ పూసర్ల సునీల్, మహిళా సాధికారత కన్వీనర్ దండు ఝాన్సీ లక్ష్మి, లైన్స్ క్లబ్ ప్రతినిధులు రాజు, వినోద్ కుమార్, మధు, మూర్తి, శర్మ, స్వామి, సీతారామరాజు, సుధారాణి పాల్గొన్నారు.

380 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 122వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 380 మంది కంటి రోగులను నేత్ర వైద్యులు పరీక్షలు చేశారు. 237మందికి ఉచిత కంటిఅద్దాలను, 95మందికి మందులు ఇచ్చారు. 30మందిని కేటరాక్ట్ ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. శిబిరంలో పాల్గొన్న రోగులు, సహాయకులకు మజ్జిగ, ఫలహారాలు, భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియాపార్ట్‌నర్ దొరస్వామి మాట్లాడుతూ, ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు : గంటా

ప్రజాశక్తి- కశింకోట : కష్టపడి పనిచేసేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు .ఆదివారం కశింకోట మండల టిడిపి నేతలు తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి. గొంతిన శ్రీనువాసురావు. జిల్లాప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి ఆధ్వర్యంలో గంటాను మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయం మేరకు కష్టబడి పనిచేయాలన్నారు. చిదిరెడ్డి శ్రీనివాసరావు,.కలగా సోమేశ్వరరావు, సూర్యనారాయణ, నాయినంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గ నాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, బుద్ధిరెడ్డి గంగయ్య.నారిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు

యాదవుల భూసమస్య పరిష్కారం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చొరవతో యాదవుల భూ సమస్య పరిష్కారమైంది. తరాలుగా యాదవులు జీవాలను నిలుపుకునేందుకు వేసిన పాకలను ఇటీవల అధికారులు తొలగించడంతో వివాదం మొదలైంది. సమస్య ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి వెళ్లడంతో సమస్యను పరిష్కరించి, అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం డిసిఎంఎస్ చైర్మన్ పళ్ళ నర్సింగరావు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో యాదవులకు, బిసిలకు స్థలాలను కేటాయిస్తామన్న హామీతో సమస్య కొలిక్కి వచ్చింది. గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంట శ్రీరామ్, వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు సమస్య పరిష్కారంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సబ్ శ్రీనివాసరావు, సర్పంచ్ దొడ్డి అప్పారావు, మాజీ సర్పంచ్ హనుమంతరావు, ప్రసాద్. కోడిబోయిన బాబ్జీ యాదవ్, డాక్టర్ బొట్ట చిన్ని యాదవ్, కిల్లాడి అప్పలరాజు దేవర అప్పారావు, సానబోయిన గోవింద్, పల్లా అర్జున్, నంబారు మాలినాయుడు, బూర అప్పారావు, బూర నాగేష్ , అన్నపూర్ణ,పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి : రానున్నది టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని,అనకాపల్లి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకష్ణను గెలిపించుకోవలసిన అవసరం అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం గవరపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జివిఎంసి అనకాపల్లిజోన్ ఐదు డివిజన్లు టిడిపి విస్తత స్థాయి సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమన్నారు. పార్టీ ఆదేశాల మేరకు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు సంపూర్ణ సహకారం అందిద్దామని పిలుపునిచ్చారు.. సోమవారం ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధంశెట్టి నీలాబాబు, 83వ డివిజన్ ఇంచార్జ్ బొద్ధపు ప్రసాద్, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి సబ్బవరపు గణేష్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, సిరసపల్లి సన్యాసిరావు, పాల్గొన్నారు.

ఢిల్లీ రైతాంగ పోరాటానికి బాసట

- 14న తిమ్మరాజుపేట జంక్షన్‌లో రైతుల నిరసన



మాట్లాడుతున్న రామ సదాశివరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఢిల్లీలో 540 రైతు సంఘాలు నాయకత్వంలో చేపడుతున్న రైతు ఉద్యమానికి మద్దతుగా ఈ నెల 14న మండలంలోని తిమ్మరాజుపేట జంక్షన్‌లో చేపట్టే మానవహారం, నిరసన ఆందోళనకు తరలిరావాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కె రామ సదాశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం పెదపాడు, చీమలపల్లి, కొండకర్ల గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు, మద్దతు ధర, ఇతర రైతాంగ సమస్యలపై పోరాడుతున్న రైతులను పిట్టల్లా కాల్చి చంపుతున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. ఆదాని అంబానీ, ఇతర కార్పొరేట్ల సేవల్లో తరిస్తున్న ప్రధాని మోడీ, రైతు సమస్యలను నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. ఈ నెల 14న నిరసనజ యప్రదానికి రైతులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రీ అప్పారావు, బుద్ధ రంగారావు, ఎస్ బ్రహ్మాజీ, తిమ్మ పాత్రని రాంబాబు, జనపరెడ్డి సూర్యనారాయణ, మజ్జి రమణ, నూకరాజు భాను నరసింహారావు పాల్గొన్నారు.

నేడు, రేపు పిఎసిఎస్ ఉద్యోగుల పెన్‌డౌన్

ప్రజాశక్తి-.అనకాపల్లి : ఈనెల 11,12 తేదీల్లో పిఎసిఎస్ ఉద్యోగులు పెన్ డౌన్ ఆందోళన చేపడుతున్నట్టు ఉమ్మడి విశాఖ జిల్లా యూనియన్ జిల్లా అధ్యక్షులు పి నాగభూషణం తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం రిజిస్టర్ అయిన ఆప్కాబ్, డిసిసిబి, పిఎసిఎస్‌లలో పిఎసిఎస్ ఉద్యోగులే అతితక్కువ వేతనాలు పొందుతున్నారని, ఎన్నెన్ని జిఒలు వచ్చినా, వేతన సవరణ గానీ, ఇతర సమస్యల పరిష్కారంగానీ లేక ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన సేవలు అందిస్తున్న తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు పెన్ డౌన్ ఆందోళన చేస్తామన్నారు అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే తదుపరిపోరాట కార్యాచరణ చేపడతామన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలకే పొత్తులు : బుద్ధ

ప్రజాశక్తి -అనకాపల్లి : చారిత్రాత్మక టిడిపి, జనసేన, బిజెపి కలయికను ఆయా పార్టీల కేడరంతా స్వాగతిస్తున్నామని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. ఆదివారం. పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, కూటమితో వైసిపి ఓటమి ఖాయమన్న భయంతో సజ్జల, విజయసాయిరెడ్డి, అంబటి, కొడాలి నాని, పేర్ని నాని, రోజాలాంటి వైసిపి నేతలు సంధి పేలాపనులు పేలుతున్నారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి పాలనలో ఆర్థికసంక్షోభంలోకి నెట్టబడిన రాష్ట్రాన్ని గట్టెక్కించడమే లక్ష్యంగా కూటమి ఏర్పాటైందన్నారు. చంద్రబాబు దార్శనిక పాలనకు ఆంధ్రా ప్రజలకు రక్షణ అని, దానికి జనసేన, బిజెపి కలసిరావడంపై హర్షం వెలిబుచ్చారు. దేశంలోనే అతిపెద్ద జాతీయ పార్టీ బిజెపితో పొత్తును అందరూ స్వాగతించి, మద్దతు చెబుతున్నారన్నారు. సైకో పాలన విముక్తికి అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ కార్యదర్శి మల్ల గణేష్, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

జోరుగా సెల్‌ఫోన్ దొంగతనాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : హనుమంతువాక పరిసర ప్రాంతాల్లో జోరుగా సెల్‌ఫోన్ దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. బస్టాపుల వద్ద ఒక ముఠాగా తయారై యువకుల నుంచి ఖరీదైన ఫోన్లు దొంగిలిస్తున్నారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. హనుమంతువాక కూడలి, బస్టాపుల వద్ద సెల్ ఫోన్ దొంగలు కాపు కాచి రద్దీగా ఉండే బస్సులు ఎక్కే సమయంలో వారి జేబుల్లో నుంచి ఫోన్లు దొంగిలిస్తున్నారు. రోజుకు సుమారు 5 నుంచి 6 ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. ఖరీదైన ఐ ఫోన్లు సైతం దొంగతనానికి గురవుతున్నాయి. దీంతో బాధితులు లబోదిబో మంటూ పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. హనుమంతువాక జంక్షన్, ఆరిలోవ, సింహాచలం వైపు వెళ్లే బస్సులు ఎక్కే సమయంలో జరుగుతున్నాయి. బస్టాపుకు సుమారు 20 అడుగుల దూరంలో పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు కూడా ఉంది. ఎదురుగా పోలీసులు ఉన్నా దొంగలు ఎటువంటి భయం లేకుండా అక్కడే మకాం వేసి దొంగతనాలు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు బస్టాపుల వద్ద కాపు కాచి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకొని, దొంగతనాలు అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వైఎస్ఆర్ చేయూత చెక్కులను అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వెల్లంకిలో చేయూత చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకిలో ఆదివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన వైఎస్ఆర్ చేయూత 4వ విడత చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆనందపురం మండలంలో 4,678 మంది లబ్ధిదారులకు రూ.8,77,12,500 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం చేశారు.

అనంతరం పంచాయతీ రాజ్ నిధులు రూ.20 లక్షలతో వెల్లంకి పంచాయతీలో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, పార్టీ మండల ప్రెసిడెంట్ బంక సత్యం, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, బోట్ల ధనలక్ష్మి, స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, కాకర వెంకటరమణ, కార్యదర్శి బాబి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ

స్త్రీ భాగస్వామ్యంతోనే అభివృద్ధి

వైసిపి ఎంపీ అభ్యర్థి ఝాన్సీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్త్రీ భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని వైసిపి విశాఖ లోక్‌సభ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళా అభివృద్ధి చెందినప్పుడే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ కె.అప్పారావు, ప్రోగ్రాం మేనేజర్ కర్రోతు దుర్గరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు స్టేడియం ప్రయివేటీకరణపై ధర్నా



ధర్నా చేస్తున్న వార్వా, నివాస్ ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు స్టేడియాన్ని ప్రయివేటీకరించరాదని, పోర్ట్ ట్రస్టు ఆధ్వర్యంలోనే నడపాలని డిమాండ్ చేస్తూ వార్వా, నివాస్ ఆధ్వర్యాన ఆదివారం పోర్టు స్టేడియం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్వా, నివాస్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.ప్రకాశరావు, బీబీ గణేష్ మాట్లాడుతూ, పోర్టు స్టేడియం పోర్టు ట్రస్ట్‌కు చెందినదని, ప్రజల ఆస్తి అయిన అది ఇప్పుడు విశ్వనాథ్ ఆస్తిగా మారిపోయిందని పేర్కొన్నారు. విశ్వనాథ్ వెంచర్ పోర్ట్ స్టేడియంలో ఇంతవరకు ఉచితంగా లేదా చాలా తక్కువ ఫీజులతో ఆటలు ఆడుకున్న సదుపాయం ఉండేదని, ఇప్పుడు భారీగా ధరలు పెంచారని తెలిపారు. ఆదివారం ఫుల్ డే క్రికెట్ ఆడాలంటే రూ.36 వేలు చెల్లించాలని చెప్పారు. దీన్ని బట్టి ఇతర ఫీజులు అంచనా వేసుకోవచ్చన్నారు. ఇంతవరకు నామమాత్రపు ఫీజుతో ప్రజలు వాకింగ్ చేసుకునే అవకాశం ఉండేదని, ఇకపై భారీ ఫీజులు చెల్లించాల్సి ఉందన్నారు. స్టేడియం ప్రయివేటీకరణ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని, పిల్లలు, యువకుల ఆటపాటలకు విఘాతం కలిగిస్తుందని తెలిపారు. పోర్టు స్టేడియంలో చెట్లు నరికివేసి కాంక్రీట్ బిల్డింగులు కడుతున్నారని, దీనివల్ల పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. పోర్టు స్టేడియం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో వార్వా, నివాస్ ప్రతినిధులు నారాయణమూర్తి, అక్కయ్యపాలెం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, మురళీరాజు, బిఎల్.నారాయణ, సత్యనారాయణ, స్థానిక వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

గుడి భూభాగంలో రోడ్డు నిర్మాణం ఆపాలని ఆందోళన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలోని ఏడు గుడులు పరదేశమ్మ ఆలయం సముదాయంలోంచి చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని ఆపాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామకమిటీ అధ్యక్షుడు వి.ప్రసాదరావు, 24వ వార్డు కార్పొరేటర్ ఎస్.పద్మారెడ్డి ఆధ్వర్యాన స్థానికులు ఆలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిల్డర్ అప్పారి గిరిబాబు, 15వ వార్డు వైసిపి కార్పొరేటర్ శ్రీవిద్య భర్త రాత్రికి రాత్రి గుడి భూమిని కబ్జాచేసి వెనుక నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌కు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారని తెలిపారు. రాత్రికి రాత్రి జివిఎంసి అధికారులను ప్రభావితం చేసి ర్యాంపు రోడ్డును పోల్చడం దుర్మార్గం అన్నారు. అనాదిగా వస్తున్న గుడి ఆస్తిని కాపాడుకోవడానికి గ్రామస్తులంతా పార్టీలకతీతంగా ఏకమై పరిరక్షించుకుంటామని స్పష్టంచేశారు. కబ్జాచేసి రోడ్డు నిర్మిస్తున్న బిల్డర్‌పైనా, మద్దతుగా నిలుస్తున్న సంబంధిత అధికారులుపైనా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్‌ను కోరారు.

స్థానిక కార్పొరేటర్ పద్మారెడ్డి మాట్లాడుతూ, అమ్మవారి ఆలయ భూముల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. 1916 నుంచి అమ్మవారి ఆస్తి గ్రామస్తుల ఆధీనంలోనే ఉందన్నారు. ఈ ఆందోళనలో స్థానిక ప్రజలు 150 మంది, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరవస్తు సూరి రాజకీయ ప్రవేశానికి మద్దతు

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగుదండు వ్యవస్థాపకుడు పరవస్తు సూరి రాజకీయ అరంగేట్రానికి పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు మద్దతు తెలిపారు. తెలుగుదండు ఆధ్వర్యాన ఆదివారం విశాఖ పౌరగ్రంథాలయంలో ఆత్మీయ సమాలోచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డివి.సూర్యారావు మాట్లాడుతూ, ఇంతవరకు ఏ రాజకీయ పార్టీ తన ఎన్నికల ఎజెండాలో తెలుగు భాషను కాపాడతామని పెట్టలేదని, అందుకే సూరి తన ఎన్నికల ఎజెండాలో మాతృభాష రక్షణకే ప్రథమ ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. రాష్ట్రంలోని ఏ పాఠశాలలోనైనా ప్రాథమిక విద్యాబోధన కచ్చితంగా తెలుగుభాషలోనే జరగాలని, అప్పుడే మాతృభాష బతికి బట్టకడుతుందని, దానికోసం మనమంతా కలసికట్టుగా కృషి చేయాలని కోరారు.

తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ, మాతృభాష రక్షణ కోసం పాలకుల చుట్టూ తిరిగి, విసిగిపోయి తప్పనిసరి పరిస్థితుల్లో రాజకీయ అరంగేట్రం చేయవలసి వచ్చిందని తెలిపారు. తెలుగు భాషను కాపాడుకోవాలన్నా, ప్రత్యేక హోదా సాధించాలన్నా, స్టీల్‌ప్లాంట్‌ను నిలబెట్టుకోవాలన్నా పార్లమెంటులోనే పోరాడాలని, ప్రస్తుత రాజకీయ పార్టీలు ఆ పనిచేసే స్థితిలో లేవు కాబట్టి ప్రజలే ఉద్యమించాలని చెప్పారు. విశాఖ పార్లమెంటు అభ్యర్థిగా తనను గెలిపిస్తే మన జాతి హక్కుల కోసం పోరాడి సాధిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజకీయ విశ్లేషకులు కిరణ్ కుమార్, డాక్టర్ ఆనంద్, రాజమన్నార్, భానుకుమార్, సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, శంకర్ నీలు, కొచ్చెర్ల సత్యనారాయణ, చిన సూర్యనారాయణ, కళాకారులు శివజ్యోతి, నవరసమూర్తి, ఇమంది ఈశ్వరరావు, మద్దూరి సుబ్రహ్మణ్యం, భాషాభిమానులు గిరిబాబు, టివి రమణ, లక్ష్మణమూర్తి, శివాజీ, రావి మోహన్, సురేష్, హాస్య ప్రయోక్త వేముల భాస్కరాచారి పాల్గొని మద్దతు ప్రకటించారు.

'ఎఎంఎఎల్' విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-సీతమ్మధార : అనకాపల్లి ఎఎంఎఎల్.కళాశాలలో 1981-84లో బిఎస్సీ చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం గురుద్వార కూడలిలోని వెన్నెల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యా బోధన చేసిన విశ్రాంత ప్రిన్సిపల్ బాలాజీ, అధ్యాపకులు బి.శేషు, కృష్ణవేణి, అరుణ, రామ్మోహన్, బుచ్చిరాజు, శంకరరావు, కె.రమేష్‌ను సన్మానించారు. అధ్యాపకులు మాట్లాడుతూ, తల్లిదండ్రులును వృద్ధాశ్రమంలో ఉంచే ఆలోచన చేయవద్దని, పిల్లలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యం కాపాడుకోవాలని, సామాజిక సేవలు చేపట్టాలని ఉద్బోధించారు. 60 ఏళ్లు నిండిన, ఉద్యోగ విరమణ చేసిన మిత్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సయ్యపురెడ్డి వెంకటేశ్వర్లు, ఎం.అప్పలనాయుడు, ప్రభాకర్‌రాజు, ఎ.అప్పలనాయుడు, డాక్టర్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

ఉచిత సంగీత శిక్షణ



అష్టపదులను ఆలపిస్తున్న శారద

ప్రజాశక్తి-సీతమ్మధార : విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎయు సంగీత విభాగ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో ఉచిత సంగీత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అష్టపదులను మండపాక శారద శ్రావ్యంగా వినిపించారు. భారతీయ సంగీత చరిత్రలో ప్రప్రథమ సంస్కృత వాగ్గేయకారునిగా గ్రంథాలలో పేర్కొన్న 'గీత గోవింద' కావ్యకర్త జయదేవుడు రచనలు, అష్టపదులపై అవగాహన కల్పించారు. రాధాకృష్ణుల గాథలు, మధురభక్తి భావంతో సాగే ఈ రచనలు నృత్యప్రదర్శనలతో పాటు సంగీత కచేరీలలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఉచిత సంగీత శిక్షణ దోహదపడుతుందని డాక్టర్ శారద పేర్కొన్నారు.

కెకె.రాజుకు మద్దతుగా ఆత్మీయ సమావేశాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మురళీనగర్‌లో 2024 ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున పోటీచేస్తున్న కెకె.రాజుకు మద్దతుగా మురళీనగర్, మాధవదార, ఎన్జీజీవోస్ కాలనీ, పిఆర్.గార్డెన్స్ క్షత్రియ పెద్దలు ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కెకె.రాజు మాట్లాడారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, కె.అనిల్‌కుమార్ రాజు, క్షత్రియ పెద్దలు శ్రీనివాసరాజు, రాజాంరాజు, ఎవిఎన్.రాజు, ఎజికె.రాజు, ఎంఎ.నరసింహరాజు, బంగార్రాజు, కె.రామచంద్రరాజు, కె.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కెకె.రాజుకు మద్దతుగా అక్కయ్యపాలెం సాదీఖానా కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ మాజీ స్టేట్ సెక్రటరీ జివి.రవిరాజు ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ బాక్సింగ్ సెంటర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు మాట్లాడారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు డి.రామకృష్ణారెడ్డి, లక్ష్మణ్ దేవ్, ఐ.వెంకటేశ్వరరావు, డి.నాగేశ్వరవు, కె.నూకరాజు, కె.జయరాం, బి.అప్పన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 1, 2, 3, 4 వార్డుల వైసిపి బూత్ కమిటీల అధ్యక్షులతో స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే అభ్యర్థుల గెలుపునకు దోహద పడతాయన్నారు. విపక్షాలన్నీ ఏకమైనా సరే వైసిపి విజయాన్ని అడ్డుకో లేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైసిపి రీజనల్ యూత్ కో-ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి.పెదబాబు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం 'మేము సిద్ధం, మా బూత్ సిద్ధం' పేరిట పోస్టర్లను విడుదల చేశారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు


ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని నేల్తేరు కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ) 2024-25 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాలను నిర్వహిస్తున్నట్టు ఆనందపురం కేజీబీవీ ప్రత్యేక అధికారి చంద్రకళ తెలిపారు. వీటితో పాటు 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, బడి బయట చిన్నారు లు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్ర్య రేఖకు దిగువన (బిపిఎల్) జీవిస్తున్న బాలికలు అర్హులని పేర్కొన్నారు.https://apkgbv.apcfss వెబ్‌సైట్‌లో విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని, పారదర్శక పరిశీలన అనంతరం ఎంపికైన వారి ఫోన్ నంబర్లకు మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామని తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసే విద్యార్థిని కుటుంబ ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40లక్షల లోపు ఉండాలని తెలిపారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : అనారోగ్యంతో మంచం పట్టిన స్థానిక కొత్తపేటకు చెందిన సిహెచ్.రమేష్‌కు స్థానిక ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చినబాబు తన సొంత నిధులతో సమకూర్చిన నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి, ఎ.చిన్న, గణేష్ మాస్టారు, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఏదీ : అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ: అధికారంలోకి వస్తే మద్యపాన నిషేదం చేస్తామని చెప్పిన సిఎం జగన్ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం షాపులు పెట్టి వాటిపై అప్పులు చేశారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. ఆదివారం మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ నర్సింగిబిల్లి, జానకిరామపురం గ్రామం వార్డు మెంబర్ మాకిరెడ్డి సత్యవతి, మాజీ వైస్ సర్పంచ్ అడిగర్ల చినబాబు, గ్రామ వాలంటీర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికి అయ్యన్నపాత్రుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని ఆయనే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. 22 మంది ఎంపిలను ఇస్తే ప్రత్యేక హోదా, రైల్వేజోన్ తెస్తానని చెప్పి, నేడు ఆ ఊసే లేదని మండిపడ్డారు. పార్టీ వేరైనా ఒకరినొకరు గౌరవించే సాంప్రదాయం ఆనాడు ఉండేదన్నారు. నేడు జగన్‌మోహన్‌రెడ్డి తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. తనపై 16 అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారన్నారు.జగన్‌కు బటన్ నొక్కడం తప్పితే, పాలన చేత కాలేదన్నారు. సిపిఎస్ రద్దు చేస్తానని టీచర్లను మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అయ్యన్న

ఘనంగా నూకతాత జాతర


ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట గ్రామంలో ఆదివారం నూకతాత జాతర ను మత్స్యకారులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మత్స్యకారులు కులదైవం నూకతాత పండుగను మత్స్యకారులు మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. ముందుగా నూకతాత ఘటాలను సముద్రంలో స్నానాలు చేయించారు. నూకతాత ఘటాలను గ్రామంలో ఊరేగించారు. పాయకరావుపేట నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, తెలుగుదేశం పార్టీ పోలీట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

రూ.84.40 కోట్లతో పెద్దేరు పనులు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-మాడుగుల: రూ.84.40 కోట్ల నిధులతో పెద్దేరు జలాశయం ఆధునీకరణ పనులు చేపడామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. పెద్దేరు జలాశయం ఆధునీకరణ పనులకు ఆదివారం శంఖుస్థాపన చేశారు. ఈ ఆయకట్టు ఆధునీకరణ అనంతరం 19,969 ఎకరాలకు సాగునీటి సమస్య తీరనుంది. రూ.9.12 కోట్లతో మైనర్ కాలువల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. తద్వారా సాగు నీరు ప్రవాహానికి మార్గం ఏర్పడనుంది. ఓమ్మలి, జగన్నాధపురంలో రూ.29.99 లక్షలతో జల్జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కొళాయిలు, 40 వేల లీటర్ల మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభించారు. కింతలి వల్లాపురం గ్రామంలో రూ.104.50 లక్షల జల్జీవన్ మిషన్ పనులను ప్రారంభించారు. ఒంటి మామిడిపాలెం గ్రామంలో రూ.80 లక్షల జల్జీవన్ మిషన్ పనులను ప్రారంభించారు.

ఓమ్మలి జగన్నాధపురం గ్రామంలో రూ.14 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాన్ని చిన్నారులతో మంత్రి ప్రారంబించారు. కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారంపై అరా తీశారు. అనంతరం చిన్నారులకు తినుబండారాలను అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కీముడు రమణమ్మ, ఎంపీపీ రాజారామ్, నీటి పారుదలశాఖ అధికారులు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

రూ.10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని రత్నంపేట పంచాయతీకి చెందిన విరోదుల పావని ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుంది. నిరుపేద కుటుంబం కావడంతో ఆపరేషన్‌కి ఆర్థికకంగా చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయంపై రత్నంపేట యువత, పెద్దలు తమ వంతుగా రూ.10వేల వరకూ నిధులు సమీకరించి ఆ కుటుంబానికి సహాయం చేశారుఅదే విధంగా రత్నంపేటకు సంబంధించి యువకులు, పెద్దలు బుచ్చంపేట పంచాయతీకి చెందిన అనిమిరెడ్డి రమణ(వార్డు కార్యదర్శి) ఈ కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేశారు. ఆర్థిక సహాయం చేయడంపై గ్రామస్తులు అభినందించారు.



నగదును అందజేస్తున్న యువకులు

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



రాజయ్యపేట తీరంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-కొత్తకోట: ఉత్తరాంధ్రలో పేరొందిన రావికమతం మండలం కల్యాణపులోవ పోతురాజుబాబు (శివుడు)పెద్దింటమ్మ ఆలయాల తిరునాళ్ళు ఆదివారం ఘనంగా ముగిసాయి. గత మూడు రోజులుగా తిరునాళ్ళు నిర్వహించారు. ఈ మూడు రోజులు సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు తిరునాళ్ళు లో పాల్గొని పోతు రాజుబాబు పెద్దింటమ్మలను దర్శించుకున్నారు. ఈ మూడు రోజులలో పాల్గొన్న భక్తులకు చోడవరం ఎమ్మెల్యే ఆర్థిక సాయం తో భోజన సదుపాయాలు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవా దాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. స్నాన ఘట్టాల వద్ద భక్తుల రాకపోకలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొత్తకోట సర్కిల్ సిఐ అప్పలనాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు పటిష్ట చర్యలు చేపట్టారు....

భారీగా ఆదాయం

కల్యాణపు లోవ లో గత మూడు రోజులు పాటు జరిగిన తిరు నాళ్ళ లో పాల్గొన్న భక్తులు కానుకల రూపంలో హుండీలలో వేసిన ఆదాయం రూ.8,లక్షల 29 వేల 716 లు రాగా ప్రసాదం అమ్మకం ద్వారా రూ 2 లక్షల 73 వేల 530లు. టికెట్‌ల విక్రయం ద్వారా రూ. 3 లక్షల 75 వేల 835 లు, తలనీలాలు, కొబ్బరి సిప్పలు వేలంతో మరో రూ. లక్షా 68 వేలు ఆదాయం సమకూరి నట్టు దేవా దాయ శాఖ ఈవో ఆశా కీరణ్మయి తెలిపారు. గత ఏడాది సుమారు రూ. 14 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది అదనంగా మరో రూ రెండు లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణపులోవలో ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట, బోయపాడు సముద్రతీరంలో ఆదివారం భక్తులు మహాశివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తుల రద్దీతో తీర ప్రాంతం కిటకిటలాడింది. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్దలు, పిల్లలు స్నానాలు ఆచరించేందుకు సముద్రతీ రానికి చేరుకోవడంతో, తీరం జనసంద్రంగా దర్శనమిచ్చింది. రాజయ్యపేట, బోయపాడు తీరాల్లో వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించారు. సముద్ర తీరం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిక్కిరిసిపోయింది. నక్కపల్లి నుంచి రాజయ్యపేట వరకు వాహనాల రద్దీ కనిపించింది. తీరంలో చిన్న చిన్న దుకాణాలు వెలిసాయి. సీఐ విజయ్ కుమార్ తీరం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



2. చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: 50 మంది లబ్ధిదారులకు 50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో మందికి ఉచితంగా వైద్యం అందించడం జరిగిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో సుమారు రూ.5కోట్ల వరకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వైద్యం సేవలు చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న ఎంతో మందికి రాజకీయాలకు అతీతంగా ఈ చెక్కులను అందించామన్నారు. ఇందుకు సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ఆక్రమణలకు గురికాకుండా చూడాలి'

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని జేపీ.అగ్రహారంలో ఇనాం భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని రైతు సంఘం నాయకులు ఒనుం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఇక్కడ గల భూమికి సంబంధించి బినామీదారుడైన రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు.తహశీల్దార్ వెంటనే స్పందించి ఆన్ లైన్ లో వన్ బి రికార్డులో వివాదాస్పదమైన వ్యక్తుల పేర్లు తొలగించి రెడ్ మార్కులో పెట్టాలన్నారు. ఈ సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ సీట్ల భర్తీకి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 5వ తరగతిలో 80 సీట్ల భర్తీకి గాను 155 మంది, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీపీలో 80 సీట్లకు గానూ 113 మంది బాలికలు హాజరై పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ కెఎస్ఆర్ కుమారి తెలిపారు. ఎంఈఓ నరేష్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖా గ్రంధాల యంలో చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంను గ్రంధాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సావిత్రి భాయ్ పూలే వర్ధంతిని జ్ఞాపకం చేసుకుంటూ ఆమె జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ మాట్లాడుతూ, కుల మత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి సావిత్రిబాయ్ పూలే అని కొనియాడారు.



చదువుతున్న విద్యార్థులు


ధర్నా చేస్తున్న యువకులు

డంపింగ్ యార్డు తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి –గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో ఉన్న చెత్త డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని కోరుతూ పల్లా కార్తిక్ సేవా ట్రస్టు ఆధ్వర్యాన 16 కాలనీలకు చెందిన యువతతో కలిసి ఆదివారం మహా ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ పల్లా కార్తిక్ మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే యార్డును తరలించాలని కొన్నేళ్లుగా ప్రజలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నా జివిఎంసి చలనం లేకుండా పోయిందన్నారు. ఊరు విడిచి ఉండాల్సిన డంపింగ్ యార్డును నివాసాల మధ్యలో ఏర్పాటుచేయడం సరికాదన్నారు. దీనిపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ, తమ నివాసాలకు సమీపంలో డంపింగ్ యార్డు ఉండడం వల్ల తమ పిల్లలకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజ సమస్యగా భావించి తక్షణమే ఇక్కడి నుంచి తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

విశాఖ పెయింటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి –గాజువాక : గాజువాక ప్రాంతంలో సిఐటియుకు అనుబంధంగా ఏర్పడిన విశాఖ పెయింటర్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కనకరాజు, ఉపాధ్యక్షులుగా అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా టోనీ బెహరా, జాయింట్ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా చలపతి, సభ్యులుగా ఈశ్వర్‌రావు, రమేష్, శ్రీను, సతీష్ తదితర 12 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ మాట్లాడుతూ, కమిటీలో ఉన్న సభ్యులందరూ కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ప్రతి ఒక్కరూ చేయాల్సిన పనులను వివరించారు.

ఉక్కులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-ఉక్కునగరం : తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అనుబంధమైన తెలంగాణ ఏంజిల్స్ ఆధ్వర్యాన ఆదివారం ఉక్కు నగరం సెక్టార్ – 8లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ వేడుకలలో మహిళలు జి.లక్ష్మి, బి.వసంత, ఎస్.జ్యోతి, జి.కవిత, ఏ.దేవికి, లలిత, ఎ.సుజాత, తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ఉపాధ్యక్షులు జి.మల్లేశం, కోశాధికారి ఎన్.నర్సింగరావు, సహాయ కోశాధికారి ఎ.తిరుపతినాయక్ పాల్గొన్నారు.

80 మందికి కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక టిడిపి కార్యాలయంలో 80 మందికి పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్ చేతుల మీదుగా ఆదివారం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఎన్‌టిఆర్ సేవా సమితి, ఎంవివిఎస్.మూర్తి సేవా ట్రస్ట్, గీతం విద్యా సంస్థల అధినేత ఎం.శ్రీభరత్ సహకారంతో చిట్టివలస బంతాట మైదానంలో ఇటీవల నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరంలో కళ్లద్దాలు అవసరమని నిర్ధారించిన 80 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఒకటో వార్డు టిడిపి అధ్యక్షుడు బి.సూరిబాబు, నాయకులు బి.అప్పలరాజు, గిడుతూరి శ్రీనివాసరావు, జోగి సన్యాసిరావు, మాజీ కౌన్సిలర్ పిట్టా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు 11వ వార్డు టిడిపి అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యాన ఆదివారం బాలాజీనగర్‌లో ఓటరు నమోదు, ఓటు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని అర్హులైన యువతీయువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. ఓట్లు వెరిఫికేషన్, ఓట్లు షిఫ్టింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు మూది అప్పారావు, ఆబోతుల అప్పలనాయుడు, ఎం.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

ప్రజాశక్తి -యంత్రాంగం

సావిత్రిబాయి పూలే వర్ధంతిని పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మధురవాడ : ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ బీసీ విభాగం అధ్యక్షులు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, నాయకులు పేడాడ రమణి కుమారి, ద్రోణంరాజు శ్రీవాత్సవ, వంకాయల మారుతీ ప్రసాద్, పోతిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పార్టీ సమన్వయకర్త కెకె.రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కటుమూరి సతీష్, అల్లు శంకరరావు, కె.అనిల్ కుమార్‌రాజు, ఆళ్లలీలావతి, శ్రీనివాసరావు, బర్కత్ ఆలి, కెవిఎన్ శశికళ, బి.గంగమహేష్, పిల్లి సుజాత, కిరణ్‌రాజు, బులుసు జగదీష్, వసంతల అప్పారావు, రాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు, ఐద్వా మధురవాడ జోన్ కమిటీల ఆధ్వర్యాన సావిత్రి భాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు మొల్లి అప్పలనరసమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు డి.కొండమ్మ, ఐద్వా జోన్ అధ్యక్షులు కె.సుజాత, ఐద్వా నగర నాయకులు కె.కుమారి, మున్సిపల్ యూనియన్ నాయకులు కె.కొండమ్మ, తోపుడు బండ్ల సంఘం నాయకులు వరలక్ష్మి, ఐద్వా నాయకులు కె.పద్మ, సీతాభవాని, విజయ, కె.గంగమ్మ, సిఐటియు నాయకులు డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఉడా కాలనీ వినాయకనగర్‌లో యాత, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు అండిబోయిన అప్పారావు, ప్రముఖ న్యాయవాది లక్ష్మి ఆధ్వర్యాన పేదలకు చీరలు, నిత్యావసర సరుకులు, అందజేశారు.


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిఐటియు, ఐద్వా నాయకులు

పరవాడ: మండలంలో చిన్నతాడి గ్రామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగానిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమగ్ర దక్పథం కలిగి, వివేకం జ్ఞానంతో కులవ్యవస్థ, అంటరానితనం అణిచివేతకు ధైర్య సాహసాలతో పనిచేసిన మహనీయురాలని పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిఐటియు శ్రామిక మహిళ సమన్వయ కమిటీ నాయకులు ఎస్ వెంకటలక్ష్మి, ఎన్ లక్ష్మి, రమణమ్మ, వరలక్ష్మి, పార్వతి, పద్మ, అప్పలనరసింహ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యావిధానంలో మార్పులు రావాలి

అపూస్మా సమావేశాల్లో గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి-మధురవాడ : యువతలో నైపుణ్యాలు పెరగాలంటే ప్రాథమిక విద్యావిధానంలో గణనీయమైన మార్పులు అవసరమని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపూస్మా) రాష్ట్ర స్థాయి టీచర్ ఎన్‌రిచ్ మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీభరత్ ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలల స్థాయి దాటి కళాశాలలకు వచ్చే యువతలో అధిక శాతం మందికి సరైన దిశా నిర్దేశం, భవిష్యత్తుపై స్పష్టత ఉండటం లేదన్నారు. ప్రాథమిక స్థాయి విద్యాభోధనలో బలమైన పునాదులు ఉంటే వారి జీవితంలో ఎదగడానికి అవకాశముంటుందన్నారు. సాంకేతికంగా ప్రపంచం పురోభివృద్ధి సాధిస్తోందని, ముఖ్యంగా కృత్రిమ మేధ, ఛాట్ జిపిటి వంటివి విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాథమిక విద్యారంగంలో వస్తున్న మార్పులకు సిద్ధంగా ప్రైవేటు విద్యాలయాలు మారినప్పుడే మనుగడ సాధ్యమన్నారు. అధ్యాపకులు తమను తాము సాంకేతికంగా తీర్చిదిద్దుకోవాలని, ఇది ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య బోధించే ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందన్నారు. ప్రాథమిక విద్యను బోధించే పాఠశాలలకు గీతం మార్గదర్శిగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అపూస్మా రాష్ట్ర మార్గదర్శి ఎ.కృష్ణారెడ్డి, కోశాధికారి ఎమ్‌వి.రావు, విశాఖ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎమ్‌వివి.సత్యనారాయణ, జి.శేషగరిరావు, ఉత్తరాంధ్ర జిల్లాలలోని 60కి పైగా వివిధ ప్రైవేటు కళాశాలల నుంచి 900 మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు. ఒత్తిడులు లేని విద్యాభోధన అంశంపై నిపుణులు మళ్ల రామునాయుడు, మళ్ల వాణిశ్రీ ప్రసంగించారు.

జిమ్సర్ ఆసుపత్రిలో జాతీయ భద్రతావారోత్సవం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లోని జిమ్సర్ ఆసుపత్రి ఆవరణలో ఆదివారం జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. గీతంలోని సెక్యూరిటీ విభాగం సిబ్బందితో పాటు భోజనశాలలు, నర్సింగ్ సేవల విభాగం సిబ్బందికి అత్యవసర పరిస్థితులలో అగ్నప్రమాదాలు జరిగిన సందర్భంలో వ్యవహరించాల్సిన పద్ధతులపై ప్రముఖ భద్రతా నిపుణుడు డాక్టర్ ఎస్‌పిబి.రంగాచార్యులు అవగాహన కల్పించారు. ఎల్‌పిజి ప్రమాదాలు ఇతరత్రా ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై నమూనా అగ్నిప్రమాద సంఘటన ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.రామాంజనేయులు, సెక్యూరిటీ విభాగం ప్రతినిధులు వైవి.నాయుడు, కె.రామాంజనేయులు పాల్గొని అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎంత ముఖ్యమో వాటిని సమర్థంగా ఎదర్కోవడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అప్రమత్తంగా వ్యవహరించిన సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు.

నేరాలు ఘోరాలు

ఎండాడలో కాలిన మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి ఎండాడ నుంచి గీతం కళాశాలకు వెళ్లే రహదారిలో ఆదివారం ఉదయం కాలిపోయిన మృతదేహం లభ్యమైనట్లు ద్వారక ఎసిపి రాంబాబు తెలిపారు. ఆదివారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారని, మృతుడు మోసుగంటి సుబ్రహ్మణ్యం (40) ఎంవిపి నివాసి కారు డ్రైవర్‌గా గుర్తించినట్లు ఎసిపి చెప్పారు. సంఘటన జరిగిన చుట్టుపక్క ప్రదేశాలను పరిశీలించినట్లు తెలిపారు. మృతునిపై పెట్రోల్ పోసి కాల్చిన ఆనవాలు ఉన్నాయని వివరించారు. మృతుడు సుబ్రహ్మణ్యంనకు 12 సంవత్సరాల క్రితం వివాహమైందని, ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. భార్యాభర్తల మధ్య గొడవలు కారణంగా భార్య మూడేళ్ల క్రితం విడిపోయిందని, లీగల్‌గా కూడా విడాకులు కూడా తీసుకున్నారని చెప్పారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడని, అతను కూడా తల్లి దగ్గరే ఉంటున్నట్లు తెలిపారు.

సుబ్రమణ్యం గతంలో చేయి కోసుకున్నట్లు తెలిపారు. సుమారు ఒంటిగంట ప్రాంతంలో తన స్టేటస్‌లో యెహెూవాకి సంబంధించిన స్లొగన్స్ పెట్టుకున్నట్లు వివరించారు. ఈ హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాల పట్టివేత

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం 16వ నంబర్ జాతీయ రహదారిలో గోవా నుండి ఇన్నోవా కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్థానిక సీఐ పిన్నింటి రమణ బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా గోవా నుండి వస్తున్న ఇన్నోవా కారును పోలీసులు పరిశీలించగా అందులో 61క్వార్టర్ సీసాలు, 17 లీటర్ మద్యం సీసాలు పట్టుకున్నట్లు తెలిపారు. ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

48 యూనిట్ల రక్త సేకరణ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస శ్రీ సత్యసాయి సేవా సమితి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఒఎస్‌జి ఫౌండేషన్ ఫస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో పలువురు దాతల నుంచి 48 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి పూర్వ కన్వీనర్ చంద్రరావు, జోన్–1 కో–ఆర్డినేటర్ సత్య సాయి, జిల్లా స్టడీ సర్కిల్ ఇంఛార్జి డాక్టర్ రవిప్రసాద్, ఆధ్యాత్మిక సమన్వయ కర్త పివిఆర్.బాబా, జి.సత్యనారాయణ, ఒఎస్‌జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డి.శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్న తగరపువలసకు చెందిన పాలెపు కీర్తి న్యూఢిల్లీలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరుగు జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. ఆమె ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ 1995–96 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.5,500 సాయం చేశారు. ఆర్థిక సాయం చేసిన వారిలో పూర్వ విద్యార్థులు వై.కృష్ణ, బి.శ్రీను, కె.దుర్గారావు తదితరులు ఉన్నారు.

పలుచోట్ల 'జేబు దొంగలున్నారు జాగ్రత్త' స్టిక్కర్లు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానికంగా రద్దీగా ఉన్న ప్రైవేట్ మార్కెట్, ఇతరత్రా ప్రాంతాల్లో "జేబు దొంగలున్నారు జాగ్రత్త" పేరుతో భీమిలి నేర విభాగం పోలీసులు ఆదివారం స్టిక్కర్లు అతికించారు. నేర విభాగం ఎస్సై ఎస్ సూర్యప్రకాశరావు ఆధ్వర్యాన సిబ్బంది పలుచోట్ల స్టిక్కర్లు అతికించారు. ఏమరుపాటుగా ఉన్న సమయంలో జేబు, బ్యాగ్‌లు కత్తిరించి దొంగతనాలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు అవగాహన కల్పించారు.


తగరపువలస మార్కెట్ వద్ద స్టిక్కరు అంటిస్తున్న ఎస్ఐ సూర్యప్రకాశరావు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -.అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సమక్షంలో ఆదివారం తగరంపూడికనకదుర్గ ఆటో యూనియన్ సభ్యులు వైసిపిలో చేరారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కోశాధికారి కిషోర్‌తో పాటు తగరంపూడి, సీతానగరం, వెంకుపాలెం, మెట్టపాలెం, జగన్నాథపురం గ్రామ లలో గల 50 మంది ఆటో డ్రైవర్లు వైసిపిలో చేరారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి.- సబ్బవరం: మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో అయిదవ తరగతి, ఇంటర్‌లలో ప్రవేశానికి 2024 –25 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు సిహెచ్‌వివి సత్యారావు తెలిపారు. ఉదయం 5వ తరగతి ప్రవేశ పరీక్ష కు 400 మంది విద్యార్థులు హాజరు కాగా, మధ్యాహ్నం ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి నిర్వహించినపరీక్షలో 267మంది హాజరయ్యారన్నారు. .ఈ పరీక్షకు పరిశీలకులుగా నాంచారి, కె.శ్రీహరి, ఎంఇఒ బిఎస్‌ఎన్ మూర్తి వ్యవహరించారు.

నేడు అభయాంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండలంలోని వాకపల్లి గ్రామంలో సోమవారం అభయాంజనేయస్వామి తీర్థం జరుగుతుందని ఆలయ ధర్మకర్త, మాజీ ఎంపిటిసి పెనగంటి సింహాచలం నాయుడు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన ఉంటుందని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పరుగుల ప్రదర్శన ఉంటుందని విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. సాయంత్రం కోలాటం, రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సింహాచలం నాయుడు తెలిపారు.

బాల కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామంలో బాల కళాకారులను గ్రామ సర్పంచ్ ఎస్‌భాగ్యలక్ష్మి నాయుడు ఆదివారం సత్కరించారు. గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతకా కార్యక్రమాల్లో ప్రదర్శన చేసిన బాల కళాకారులను సన్మానం చేశారు. గ్రామ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డులో సోలార్ బల్బులు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి పార్లమెంటు అభివృద్ధి నిధులతో స్థానిక ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డులో నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో పది సోలార్ బల్బులు ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.

గుంటువాడ రిజర్వాయర్ వద్ద మొసలి మృత్యువాత

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు గుంటవాడ రిజర్వాయర్‌లో అరుదైన మొసలి ఒకటి మృత్యువాత పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఒడిశా అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని, మొసలి మృతదేహానికి పంచనామా నిర్వహించి, ఖననం చేశారు. కాగా రిజర్వాయర్‌కు ఆనుకొని ఉన్న కంపెనీ కాలువ వద్ద కొన్నేళ్లుగా మొసళ్ల సంచారం ఉన్నట్లు స్థానికులు అంటున్నారు. అటుగా మేకలు, పశువులు మేతకు వెళ్లి, నదిలో నీరు తాగేందుకు దిగే సమయంలో మొసలి భారిన పడి మృత్యువాత పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ క్రమంలోనే గుంటవాడ రిజర్వాయర్ సమీపంలో ఒడ్డుపైకి వచ్చిన మొసలి మరణించిన ఘటన ఇపుడు సంచలనమైంది.

57వ రోజుకు ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తనను రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిపించాలంటూ విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ ప్రజలను కోరారు. కొద్ది రోజులుగా ఆయన చేస్తున్న పాదయాత్ర ఆదివారానికి 57వ రోజుకు చేరింది. హెచ్‌బి కాలనీ లాస్ట్ బస్సు స్టాప్, వెంకోజీపాలెం నుంచి వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, అప్పారావుతో కలిసి ఈ పాదయాత్ర నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

ఆత్మీయ సమావేశం

జివిఎంసి 16వ వార్డు పాత వెంకోజీ పాలెం రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం హెచ్‌బి కాలనీలో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా జగన్ పాలన కొనసాగిస్తున్నారన్నారు.

డైలమాలో గండి బాబ్జీ

దక్షిణంలో 'పొత్తు' ఎసరు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి – జనసేన పొత్తుతో విశాఖ దక్షిణంలో గండి బాబ్జీ టికెట్‌కు ఎసరు వచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ నియోజక వర్గం నుంచి జనసేన పోటీ చేసే వీలుందని ఇటు జనసేన, అటు టిడిపి కార్యకర్తలు బాహాటంగానే చెబుతున్నారు. దీంతో దాదాపు మూడేళ్లుగా దక్షిణ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ, రానున్న ఎన్నికలలో ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్న గండి బాబ్జీ తీవ్ర నిరాశకు గురైనట్లు తెలిసింది. ఈ కారణంగానే.. నియోజవర్గంలో ఇటీవల గండి బాబ్జీ వార్డుల వారీగా చేపట్టిన బాబు భరోసా... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని అర్థాంతరంగా నిలిపివేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొద్దిరోజుల క్రితం చంద్రబాబు నుంచి పిలుపు రావడంతో అమరావతికి వెళ్లి చంద్రబాబుతో బాబ్జీ భేటీ అయ్యారు. దక్షిణ నియోజకవర్గం టికెట్‌పై చంద్రబాబు నుంచి స్పష్టమైన హామీ లభించలేదు. అయినప్పటికీ నియోజవర్గంలో పని చేసుకోవాలని చంద్రబాబు చెప్పడంతో దింపుడు కళ్లెం ఆశతో నియోజవర్గంలోని 31, 33 వార్డులలో కొద్దిరోజుల క్రితం ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగించవలసి ఉండగా నిలిపివేశారు. నిత్యం పార్టీ కార్యాలయానికి వచ్చే బాబ్జీ కార్యాలయానికి రావడం లేదని తెలిసింది. ఇదిలా ఉండగా ఈ నియోజకవర్గంలో టిడిపి ముఖ్య కార్యకర్తలు ఇటీవల జిల్లా పరిషత్ సమీపంలోని కల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఒక సమావేశాన్ని నిర్వహించారు. బాబ్జీకి టికెట్ రాదనే అంశంపై వారు చర్చించారు. బాబ్జీకి టికెట్ ఇస్తారా ? ఇవ్వరా ? అన్న విషయాన్ని పార్టీ అధినాయకత్వం స్పష్టం చేయాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. పార్టీ నిర్ణయాన్ని బట్టి తమ వైఖరి ఉంటుందని అందులో పేర్కొన్నారు. తీర్మానం కాపీని టిడిపి విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త ఎం.శ్రీభరత్‌కు స్వయంగా సమర్పించారు. దీనికి ఆయన బదులిస్తూ.. కార్యకర్తల అభిప్రాయాలను, మనోభావాలను పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకువెళతానని, తొందరపడి ఎటువంటి నిర్ణయమూ తీసుకోవద్దని వారించారు. ఈ నేపథ్యంలో నియోజవర్గానికి చెందిన టిడిపి నాయకులు కొంతమంది ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడును కలిసి దక్షిణ టిక్కెట్టు టిడిపికి ఇవ్వాలని కోరారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే గండి బాబ్జీకి దక్షిణ టిడిపి టికెట్ దక్కకపోవచ్చుని భావిస్తున్నారు.


గండి బాబ్జీ

జనసేనకే టికెట్...?

దక్షిణ నియోజకవర్గం టిక్కెట్ జనసేన పార్టీకి కేటాయించినట్లు టిడిపి ముఖ్య నాయకుడు ఒకరు తెలిపారు. జనసేన పార్టీ తరపున ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఈ నియోజవర్గం నుంచి పోటీ చేస్తారని తెలిసింది. ఈ మేరకు వంశీకృష్ణ శ్రీనివాస్ పోటీ చేస్తే టిడిపి క్యాడర్ అంతా పనిచేస్తుందా.. లేదా..? అనే అంశంపై టిడిపి సర్వే నిర్వహించింది. పార్టీ కార్యకర్తలను అభిప్రాయాలు కోరింది. అయితే దాదాపు కార్యకర్తలంతా టికెట్‌ను టిడిపికి ఇవ్వాలని, జనసేనకు ఇస్తే వంశీకష్ణ శ్రీనివాస్‌కు ఎవరూ పనిచేయబోమని అధిక శాతం మంది సర్వేలో చెప్పినట్లు తెలిసింది.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన విస్తృత సేవలు


ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు అన్నారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టుకు వచ్చే న్యాయవాదులకు, కక్షిదారులకు మెరుగైన సౌకర్యాల అందించడమే ధ్యేయంగా తమ బాడీ పనిచేసిందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తాను ఎన్నికైన తర్వాత కమిటీ నేతృత్వంలో జిల్లా జడ్జి సహకారంతో కోర్టు పరిసరాల శుభ్రత, పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. నూతన కోర్టు భవన సముదాయంలో పలు పనులు చేపట్టామన్నారు. చీఫ్ జడ్జి సహాయ సహకారాలతో మంజూరైన 272 ఎసిలలో 230 అమర్చామన్నారు. రాష్ట్ర వ్యాపిత క్రికెట్ టోర్నీ నిర్వహించామన్నారు. ఏడాదిలో సుమారు 10 నెలల పాటు లైబ్రరీ సెక్రటరీ సహకారంతో ప్రతి శుక్రవారం జూనియర్, సీనియర్ న్యాయవాదులు, లా కాలేజీ ప్రొఫెసర్‌లతో న్యాయ సలహాలు, క్లాసులు ఏర్పాటు చేశామన్నారు.

అభివృద్ధి పనుల్లో తమకు సహకరించిన కమిటీ సభ్యులకు, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ చిగిలిపల్లి భాస్కరరావు, జాయింట్ సెక్రటరీ ధర్మాల దుర్గాప్రసాద్, లేడీ రిప్రజెంటేటివ్ కె.లక్ష్మీ దుర్గ నాగశ్రీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చవిటిపల్లి బాలరాణి, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఈగల పద్మలత, కరకాని వరప్రసాద్, పి. శ్రీధర్, మణికంఠ పాల్గొన్నారు.

వివేకానంద పార్కులో వృక్ష విలాపం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఒక మొక్క, చెట్టుగా ఎదగాలంటే ఎన్నో ఏళ్లు నిరీక్షించక తప్పదు.. మన చుట్టూ ఉన్న చెట్టూ చేమ అంతా అలా ఏర్పడినవే. జీవరాశి మనుగడకే ఆధారమైన చెట్లను కాపాడుకోవాల్సిన పరిస్థితి నుంచి వాటిని తుంచేసే ఆలోచన చేయడం మానవ మనుగడకే ప్రమాదం. అలాంటి సన్నివేశం విశాఖ నగరంలోని 8వ వార్డులోని వివేకానందనగర్‌లో తాజాగా చోటుచేసుకుంది. ఏళ్లతరబడి నీడనిచ్చిన ఒక మర్రి చెట్టు తాలూకా కొమ్మలను కొందరు నరికేశారు. దీనిపట్ల పార్కుకొచ్చే వాకర్స్, షట్లర్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రచ్చబండ నిర్మాణం కోసమే చెట్టులో చాలా భాగం నరికివేసినట్లు చెబుతున్నారు. అభివృద్ధి పని పేరుతో పార్కు నిండా నిర్మాణాలు చేపట్టి వాకర్స్, ఇతర ఆటలు ఆడుకునే వారికి స్థలం లేకుండా చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వివేకానంద పార్కులో జరుగుతున్న పలు పనులపై జనం తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయినా సరే వివేకానందనగర్ కాలనీ రెసిడెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో వీరిపై తీవ్ర స్థాయిలో ఇక్కడకొచ్చే వారు మండిపడుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.


నరికివేతకు గురైన చెట్టు

250 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. డాక్టర్లు తలారి వెంకటసుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమామహేష్, ఎస్.సంపత్‌కుమార్ పాల్గొని 250 మందికి వైద్యసేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. వీరిలో 57 మందికి రక్తపరీక్షలు, నలుగురికి థైరాయిడ్ పరీక్షలు, 14మందికి ఎక్స్‌రేలు, ఒకరికి ఇసిజి, 10మందికి ఫిజియోథెరపీ చేశారు.

వారపు సంతల్లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ, సీలేరు వారపు సంతలో ఆదివారం సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం మన్యం బంద్‌కు పిలుపునివ్వడంతో స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక, ప్రత్యేక పోలీసు బలగాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు

యువతకు దుస్తులు, బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి- కూనవరం: మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌లు పర్యటించారు. జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా రంపచోడవరం ఒఎస్‌డి కెవి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో చింతూరు ఎఎస్‌పి రాహుల్ మీనా, ఎటపాక సిఐ రామారావు సూచనల మేరకు గిరిజన యువతకు, గొత్తి కోయలకు టీషర్ట్స్, స్వెట్టర్లు, రగ్గులు, బ్యాగ్‌లు పంపిణీ చేసారు.

నూకాంబికకు ఎంవిఆర్ పూజలు

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నూకాలమ్మ మహోత్సవం నిర్వహించారు. తప్పెటగుళ్ళు, కరీంనగర్ ఘటం డాన్స్, పులివేషాలు, కంజిరి డాన్స్ అరకు, పాడేరు గిరిజన నృత్యాలు, పులి వేషాలు, ఇతర ప్రదర్శనలతో కుటుంబసమేతంగా వందలాది మందితో వెళ్లి నూకాంబిక మొక్కు తీర్చుకున్నారు. ఎంవిఆర్ సతీమణి, కుమారులు సతీష్, రాజేష్, ఎంవీఆర్ యువసేన, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు టిటిడి నిధులు

ప్రజాశక్తి -చోడవరం : నియోజకవర్గంలో ఎస్‌సి, బిసి ప్రాంతాల్లో ఉన్న వివిధ దేవాలయాల నిర్మాణాలకు టిటిడి నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. బుచ్చయ్యపేట మండలం చెన్నయ్యపాలెం, మల్లం గ్రామాల్లో రామాలయాల నిర్మాణం, చోడవరం మండలం నరసయ్య పేట సాయిబాబా ఆలయం, చోడవరం కామాక్షి దేవి ఆలయం, గోవాడ, జై జగన్నాథపురం రామాలయాలు, రావికమతం మండలం గుడ్డి ప, పొన్నవోలు గ్రామాల్లో రామాలయాల నిర్మాణం, రోలుగుంట మండలం కే నాయుడుపాలెం, వడ్లవలస, వడ్డిప, వట్లవలస, శరబండపాలెం, రోలుగుంట, అట్లపాలెం గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు టిటిడి నిధులు మంజూరయ్యాయన్నారు.

ఘనంగా పోతురాజు పండగ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో తీడ గ్రామంలో కల్యాణ పోతురాజు పండగ ఆదివారం ఘనంగా జరిగింది పూజరులు సింగపల్లి సత్యం, రెడ్డి సత్యవతి, సర్పంచ్ చిరికి సత్యనారాయణ, ఎంపిటిసి దుంగల అప్పలనాయడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భీమలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- కె.కోటపాడు: టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడిన సందర్భంగా కె కోటపాడు మాజీ సర్పంచ్ డోకల నరసింహామూర్తి ఆధ్వర్యంలో స్థానిక భీమ లింగేశ్వరస్వామి ఆలయంలో తెలుగుదేశం జనసేన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. డోకల సన్యాసినాయుడు, రొంగలి చిరంజీవి గండి బోయిన అప్పారావు, రెడ్డి నూకరాజు, బండారు ప్రవీణ్, బత్తుల త్రినాథ్, పైలాగోపి పాల్గొన్నారు.

దక్షిణంలో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గం నుంచి ఈసారి టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున జనసేన పోటీ చేయడం దాదాపు ఖరారయినట్లుగా భావించవచ్చు. తూర్పు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం దక్షిణ నియోజకవర్గంలో బైక్ ర్యాలీలో పాల్గొని జిల్లా పరిషత్ సమీపంలోని కల్యాణ మండపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.